క్లుప్తంగా

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర



ఈడిగపల్లెలో కొలువు దీరిన గంగమ్మ

కార్వేటినగరం: మండలంలోని ఈడిగపల్లెలో బుధవారం నడివీధి గంగమ్మ జాతర వైభవంగా జరుపుకున్నారు. వేకువజామున అమ్మ వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై కొలువు దీర్చి ప్రత్యేక వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. యువత, చిన్నారులు ప్రత్యేక వాయిద్యాలకు నృత్యాలు చేశారు. అనంతరం నడివీధిలో కొలువుదీరిన అమ్మవారికి పిండి దీపాలతో నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు



విశేషాలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశ్వరస్వామి వారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరుడికి పసుపు, కుంకుమ, పాలు, పెరుగుతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళమిస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు బుధవారం విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీహాస్ ఆర్య కుటుంబసభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం సరికాదు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణపై ఆరోపణలు అవాస్తవామని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు పూర్ణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గిరిధర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడిన ఆయనపై కొందరూ పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. కొందరి స్వలాభం కోసం విమర్శలు చేస్తున్నారని, తీరు మార్చుకుని ఏకతాటిపై నడవాలని హితవు పలికారు.

పక్వానికి వచ్చిన కాయలే కోయాలి



బంగారుపాళెం: మార్కెట్‌లో మామిడి కాయలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ సాగరిక

బంగారుపాళెం: పక్వానికి వచ్చిన మామిడి కాయలను కోసి విక్రయిస్తేనే మంచి ధర వస్తుందని ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. బుధవారం స్థానిక మామిడి మార్కెట్‌ను ఆమె సందర్శించారు. మండీలకు రైతులు తీసుకు వచ్చిన మామిడికాయలను పరిశీలించారు. తోతాపురి కాయలను రైతులు ర్యాంప్‌లలో, మండీలలో విక్రయించకుండా నేరుగా ఫ్యాక్టరీలకు తీసుకు వెళ్లాలన్నారు. ఫ్యాక్టరీల్లో టన్నుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఇతర రకాలను మాత్రం మండీలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. పక్వానికి వచ్చిన కాయలకు మంచి ధర ఉంటుందన్నారు.

వరికి తెగుళ్ల బెడద



పుత్తూరులో ముందస్తు వరిసాగు



కొనసాగుతున్న వరినాట్లు

- ఆందోళనలో అన్నదాతలు
- పిలక దశలో సోకిన తెల్ల తెగులు
- వాతావరణ మార్పులే కారణమంటున్న వ్యవసాయాధికారులు



తెల్లతెగులు సోకిన వరిపంట

పుత్తూరు: వ్యవసాయ డివిజన్ పరిధిలో ముందస్తు ఖరీఫ్ పంటగా సాగు చేసిన వరి పంటకు తెగుళ్ల సోకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పుత్తూరు మండలంలో ఆకు ముడత, తెల్ల తెగులు సోకడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు పేర్కొంటున్నారు. అవసరాన్ని బట్టి రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా తెగుళ్ల బెడదను అరికట్టవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ముందస్తు ఖరీఫ్ పంటపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఒక్క పుత్తూరు మండలంలో 65 హెక్టార్లలో వరి పంట సాగైంది. నేసనూరు రెవెన్యూ పరిధిలోని చౌటూరు, గట్టు, వడ్డిండ్లు, నేసనూరు, ద్వారకానగరం, పిళ్లారిపట్టు, గంగమాంబాపురం, తాయిమాంబాపురం గ్రామాల్లో సాగైన వరి పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు సస్యరక్షణ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

పంటలకు నష్టం ఇలా..

ఆకుముడత, తెల్లతెగులు సోకిన వరి పంటలో గొంగళిపురుగు ఆకు ముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు తెల్లబడతాయి. సస్యరక్షణ చర్యలు ఆలస్యం అయితే ఆకు పూర్తిగా ఎండిపోయి నష్టం వాటిల్లుతుంది. కాండం తొలిచే పురుగు కారణంగా దుబ్బు మధ్యలో ఎండిపోవడంతో వెన్ను విరిగి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుంది.

మొదటికే మోసం వచ్చేట్టు ఉంది..



వ్యయ ప్రయాసలతో చేస్తున్న వ్యవసాయం జూదంలా తయారైంది. నాకున్న మూడెకరాల్లో వరి సాగు చేశాను. తెగుళ్ల సోకడంతో పంట దెబ్బతింటోంది. ముందస్తు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందనుకుంటే మొదటికే మోసం వచ్చేటట్లు ఉంది. సస్య రక్షణ చర్యలు చేపట్టాను. పంట దిగుబడిపై ఆశగానే ఉన్నాను.

–కె.వెంకటేశులు, రైతు, చౌటూరు

సకాలంలో సస్యరక్షణ చేయాలి..



వాతావరణ మార్పుల కారణంగా తెగుళ్ల పంటలను ఆశిస్తున్నాయి. తెగుళ్ల సోకిన పంటలకు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకే మందులు వినియోగించాలి. ఆకుముడత, తెల్ల తెగులు సోకిన వరి పంటకు క్లోరిఫైడిపాస్ 2.5 ఎంఎల్ మందును ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. లేదా మోనాక్రోటోపాస్ 1.6 ఎంఎల్, లేదా ప్రొఫెనోపాస్ 2 ఎంఎల్ మందును ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఈ పిచికారీ ఉదయం లేదా సాయంత్రం మాత్రమే చేయాలి. పిచికారీ చేసిన 24 గంటల్లో వర్షం పడినట్లయితే మళ్లీ పిచికారీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పంటను ఆశించిన తెగుళ్లపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

–ఎస్.కోదండయ్య, వ్యవసాయాధికారి, పుత్తూరు

గంగమ్మకు ఘనంగా పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో ఆరిమానుగంగమ్మ

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఉన్న ఆరిమాను గంగమ్మ ఆలయంలో బుధవారం సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే ఎనమలమంద గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా మహిళలు పొంగళ్లు పెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో జాతరల సందర్భంగా కోలాహలం నెలకొంది.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: చవటగుంటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరగనున్న మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం నిర్వహించారు. గురువారం నుంచి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త రాధారెడ్డి తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలతచే హరికథ కాలక్షేపంతో పాటు ప్రతిరోజూ రాత్రి వేంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

విజయవంతం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

నింద్ర: ప్రభుత్వం చేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవాని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మట్లాడుతూ ఈనెల 13 నుంచి జూలై 12 వరకు 6 ఏళ్ల నుంచి 14 సంవత్సరాల వరకు వయస్సు కలిగిన పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. ప్రతిగ్రామంలో తిరిగి నమెదు చేయాలని ఆమె అన్నారు. అదేవిధంగా బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. ర్యాలీలో విద్యాధికారులు వసుమతిదేవి, శ్రీధర్‌రాజు, డీటీ మాధవిలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్‌పీలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య మార్పునకు సాధనం



నెత్తంకండ్రిగ వైసీలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంఈవోలు



ఎం.కొత్తూరులో నేను బడికిపోతా కార్యక్రమాన్ని వివరిస్తున్న హెచ్‌ఎంలు

నగరి: విద్య మార్పునకు సాధనం అని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. బుధవారం మండల ప్రాథమిక పాఠశాల నెత్తంకండ్రిగ వైసీలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ 14 సంవత్సరాలు వయస్సున్న ప్రతి ఒక్కరూ బడిలో ఉండాలన్నారు. విద్య ఒక్కటే మార్పునకు సాధనం అన్నారు. ఈ సందర్భంగా ఎం.రమేష్ అనే దాత విద్యార్థులకు రూ.4 వేల విలువజేసే విద్యాసామగ్రిని వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి నేడు బడికి పోతా కార్యక్రాన్ని నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



ఐకేపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో తమ సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం ఫరీద్‌మస్తాన్ మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పెంచాలని తెలిపారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

భక్తాగ్రేసురుడిపై శ్రీరాముని అభయ ప్రదానం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీకోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను శ్రీరామచంద్రమూర్తి కటాక్షించారు. ఉదయం ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. సాయంత్రం సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. తర్వాత ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించి, ధూపదీపనైవేద్యాలు సమర్పించారు. రాత్రి హనుమంత వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు చెన్నైకి చెందిన కుమార్‌వేల్ కుటుంబసభ్యులు పూజా సామగ్రిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు.

అనుమానాస్పదస్థితిలో చిత్తూరు వాసి మృతి

తిరువళ్లూరు: చిత్తూరు జిల్లా నగరికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా నగరికి చెందిన నరసింహన్(55) ఐదేళ్లుగా పేరంబాక్కంలోని సెలూన్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పేరంబాక్కం గ్రామానికి చెందిన వితంతు మహిళ గౌరితో పరిచయం ఏర్పడి వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో వీరిద్దరు సహజీవనం చేస్తున్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న నరసింహన్ తన సొంతూరైన నగరికి వెళుతున్నట్టు చెప్పి, గత 17వ తేదీన పేరంబాక్కం నుంచి నగరికి బయలుదేరాడు. అయితే మరుసటి రోజు పేరంబాక్కంలోని ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో ఉన్న వినాయకుడి ఆలయం వద్ద స్పృహ తప్పి పడిపోయి ఉన్నట్టు స్థానికులు గౌరికి సమాచారం అందించారు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి గౌరి వెళ్లి పరిశీలించగా అప్పటికే నరసింహన్ మృతిచెందినట్టు నిర్ధారించి పోలీసుల సాయంలో మృతదేహాన్ని తరలించారు. నరసింహన్ మృతికి అతిగా మద్యం తాగడమే కారణమా? లేదా ఎవరైనా హత్య చేసి పడేశారా? అన్న కోణంలో మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును మొదలెట్టారు.

తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయించుకోవాలి



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: గర్భిణులు ప్రతినెలా తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పు వస్తున్న కారణంగా తాగునీటిని కాసి, వడపోసి తాగాలన్నారు. గర్భిణులు రక్త పరీక్షలు చేసుకున్న తరువాతనే నెలసరి వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. మాతాశిశు మరణాలు అరికట్టాలంటే ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. అనంతరం గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

కోలాహలం.. అర్జున తపస్సు



తపస్సుమానుపై నుంచి విసిరిన పూలు, నిమ్మకాయలు పట్టుకుంటున్న భక్తులు



ద్రౌపదీ మానసంరక్ష నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

పాలసముద్రం: మండలంలోని కృష్ణజిమ్మాపురంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ, అర్జున తపస్మాన్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మెదవాడ గ్రామానికి చెందిన అర్జున వేషధారి భాస్కర్‌మెట్టు, మెట్టు మెట్టుకు పరమ శివుడిని వేడు కుంటూ పద్యాలు ఆలపిస్తూ తపస్సు మానును అధిరోహించాడు. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద ఒరపడి, సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్సుమాను పైనుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. మండలంలోని గ్రామాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, తపస్మాన్ కార్యక్రమాన్ని వీక్షించారు.

పచ్చిరొట్ట.. పంటకు బలం

- సేంద్రియ సాగుపై మొగ్గు చూపుతున్న రైతులు
- తగ్గిన రసాయన ఎరువుల వాడకం
- రాయితీపై విత్తనాల సరఫరా



ఆర్కేవీబీ పేటలో సాగు చేసిన పిల్లిపెసర

కార్వేటినగరం: పచ్చిరొట్ట ఎరువులతో పంటకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలో మెట్ట భూముల్లో పచ్చిరొట్ట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. జనుము, జీలుగ, పిల్లిపెసర పచ్చిరొట్ట పంటలను సాగు చేసి, అనంతరం భూమిలో కలియదున్నడంతో భూమి సారవంతం కావడంతోపాటు రసాయన ఎరువులను వాడాల్సిన అవసరం తగ్గుతోంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దీనికితోడు పచ్చిరొట్ట పంటల సాగుపై వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రైతులకు అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ క్రమంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల్లో పచ్చి రొట్ట పంటలను ఎక్కువగా రైతులు సాగు చేస్తున్నారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ రకాల పచ్చిరొట్ట పైర్లలో స్థూలపోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూలపోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

గుళికలతో నష్టం

పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు గుళికలను అధికంగా వాడడంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు శాస్త్రవేతల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులుండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్లు పరిశోధనలో తేలింది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయ ఉప సంచాలకులు తెలిపారు.

పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలి



రైతులు రబీ, ఖరీఫ్ సీజన్ల మధ్య పొల్లాల్లో పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకోవాలి. దీంతో భూసారం పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయి. పంట కోసిన వెంటనే పదునుపై పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పచ్చిరొట్ట విత్తనాలు శుక్ర, శనివారాల్లో రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–హేమలత, వ్యవసాయాధికారి, కార్వేటినగరం

వైభవంగా గంగ జాతర



అమ్మవారికి పూజలు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం రాత్రి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారు జామున నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. రాత్రి అమ్మవారిని బాణసంచా పేలుళ్ల సందడి నడుమ జలప్రవేశానికి తరలించారు. అదేవిధంగా మండలంలోని పాలేరు దళితవాడలో బుధవారం రాత్రి గంగమ్మను యువత కేరింతల నడుమ జలప్రవేశానికి తరలించారు.